క్లుప్తంగా

క్రీడాకారులకు ఆర్థిక సాయం



క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న అప్పన్న

భోగాపురం: మండలంలోని దల్లిపేట పంచాయతీ గాలిపేట గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మరడ అప్పన్న మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా యువకులు, గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గాలి సూర్యనారాయణ, కొయ్య రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సేవా భావం



శిశు సంరక్షణ కేంద్రానికి ఫ్యాన్లు అందజేస్తున్న తిరుమలరావు

విజయనగరం ఫోర్ట్: చిన్నారులు, వృద్ధులకు చేయూత ఇవ్వడం అభినందనీయమని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. నగరంలోని రెయిన్ బో శిశు సంరక్షణ కేంద్రానికి బొత్స తిరుమలరావు, సౌజన్య దంపతులు ఏడు సీలింగ్ ఫ్యాన్లు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వస్తు, ధన, ఆహారం రూపేన పేదలకు సాయం చేయడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో శిశు గృహ మేనేజర్ త్రివేణి, మేనేజర్ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల వివరాల సేకరణ



లింగావలసలో సర్వే చేస్తున్న ఐఈఆర్‌పీఎస్ సిబ్బంది

భోగాపురం: మండల పరిధిలో దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు సర్వే కొనసాగుతోంది. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ఐఈఆర్‌పీఎస్ సిబ్బంది డీవీ రమణరాజు, రమణమ్మ మంగళవారం పలు గ్రామాల్లో పర్యటించి దివ్యాంగుల వివరాలు సేకరించారు. వనుంపేటలో ఇద్దరు, సవరవిల్లిలో ముగ్గురు, రావాడలో ఇద్దరు, ముంజేరు, నారుపేట, బోరపేట గ్రామాల్లో ఒక్కరు చొప్పున మొత్తం 10 మంది దివ్యాంగులను గుర్తించి వారి వివరాలను నమోదు చేసినట్లు ఐఈఆర్‌పీఎస్ సిబ్బంది తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి



అనుమానాస్పదరీతిలో ఉరివేసుకుని మృతిచెందిన వనిత

విజయనగరం క్రైమ్: స్థానిక అలకానంద కాలనీలో నివాసం ఉంటున్న వివాహిత మంగళవారం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరివేసుకుని అనుమానాస్పద రీతిలో మృతిచెందింది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన పొటుపురెడ్డి వనిత (23) తన భర్త రాకోడు గ్రామానికి చెందిన రామారావుతో కలిసి అలకానంద కాలనీలో మూడు నెలలుగా నివాసం ఉంటోంది. భర్త సెంట్రింగ్ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి గదిలో అనుమానాస్పదరీతిలో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరివేసుకుని మృతిచెందింది. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, విచారణ చేపట్టారు. మృతురాలి తండ్రి రామునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి కళాసీల విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న కళాసీలు

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారంలో పైడితల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థానిక సివిల్ సప్లయిర్స్ గొడౌన్‌లో పని చేస్తున్న అదే గ్రామానికి చెందిన కళాసీలు రూ.30,116 విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు కోట్ల లక్ష్మణరావు, లక్ష్మణకు కళాసీలు నగదును మంగళవారం అందజేశారు.

వైభవం.. పైడితల్లి రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిన వెంపడాం
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పైడితల్లి అమ్మవారి అంజలి రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైన పాల ధారోత్సవం 4 గంటలతో ముగిసింది. 4.10 నిమిషాలకు పైడితల్లి అమ్మవారి అంజలి రథోత్సం ప్రారంభమైంది. పూజారులు పిన్నింటి అప్పలనాయుడు, పిన్నింటి సత్యనారాయణ అంజలి రథాలను అధిరోహించారు. వెంపడాం గ్రామముఖ ద్వారం నుంచి గ్రామం శివారు వరకు మూడుసార్లు రెండు అంజలి రథాలు, నల్ల ఏనుగు, రెండు సాధారణ రథాలు తిరిగాయి. భక్తులు పూజారులపైకి అరటిపళ్లను విసిరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు పూరిగంటి వంశీయుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. సుమారు ఆరు దశాబ్దాల తరువాత నిర్వహిస్తున్న పండగలు కావడంతో విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్టణం, అనకాపల్లి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గ్రామానికి వచ్చే దారులన్నీ భక్తులతో కిటకిటలాడుతూ కనిపించాయి. పూసపాటిరేగ, నెల్లిమర్ల ఎస్సైలు ఎ.సన్యాసినాయుడు, రామగణేష్‌లు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు పిన్నింటి వెంకటరమణ, పిన్నింటి శ్రీనివాసరావు, సర్పంచ్ పిన్నింటి కుమార్, పిన్నింటి ఎల్లంనాయుడు, కొరటాన ప్రసాదరావు, పిన్నింటి రామునాయుడు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వెంపడాంలో పైడితల్లి అమ్మవారి అంజలి రథోత్సవం



రథాలను అధిరోహిస్తున్న పూజారులు



వెంపడాంలో పోలీసుల బందోబస్తు



పూసపాటిరేగలో అసిరితల్లి అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా అసిరితల్లి పండగ

పూసపాటిరేగ: మండల కేంద్రమైన పూసపాటిరేగలో అసిరితల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారి పూజారి పత్తి వంశీయులు ఘటాలను గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగించారు. రాజావీధి, భూడివీధి, యాతపేట, ఎస్సీ కాలనీ, జాతీయ రహదారి మీదుగా అసిరితల్లి అమ్మవారి గుడి వరకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం గుడిలో మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్ టొంపల సీతారాం, ప్రజాప్రతినిధులు మహంతి లక్ష్మణరావు, మహంతి జనార్దనరావు, మలుకుర్తి శ్రీనివాసురావు, తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న భానుడు



భోగాపురంలో నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి



నెల్లిమర్ల రూరల్: మధ్యాహ్నం 12 గంటల సమయంలో నిర్మానుష్యంగా ఉన్న నెల్లిమర్ల-రణస్థలం ప్రధాన రహదారి

- పెరిగిన ఎండ తీవ్రత
- నిత్యం 40 డిగ్రీలకు పైగా నమోదు
- ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- నిర్మానుష్యంగా మారిన రహదారులు

భోగాపురం/నెల్లిమర్ల రూరల్: వేసవి ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 గంటలకే భానుడు ఉగ్రరూపం దాలుస్తుడడంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు బేంబెలేత్తిపోతున్నారు. దీంతో ప్రధాన రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ప్రతిరోజు 40 నుంచి 42 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ ప్రభావంతో జాతీయ రహదారిపై కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ఆర్టీసీ బస్సులు మినహా లారీలు, ఆటోలు కూడా పెద్దగా రాకపోకలు సాగించకపోవడంతో భోగాపురం, సవరవిల్లి, రాజాపులోవ కూడళ్లు జన సంచారం లేక నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

వ్యాపారాలు సాగడం లేదు

వేసవికాలంలో కూల్‌డ్రింక్స్, జ్యూస్‌లు, చెరుకు రసాలకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. అయితే ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జనాలు అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావడం లేదు. దీంతో వ్యాపారాలు పెద్దగా ఉండడం లేదని చిరు వ్యాపారులు వాపోతున్నారు.

వడగాల్పులతో జాగ్రత్త



ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. వీలైనంత వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగకపోవడం మంచిది. అత్యవసర పనుల మీద బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ ధరించాలి. డీ హైడ్రేషన్‌కు గురికాకుండా తరచూ నీరు, గ్లూకోజ్ వాటర్, కొబ్బరి నీళ్లు, చెరకురసం, బార్లీ నీరు తాగుతుండాలి.

– డాక్టర్ తిరుపతిస్వామి, పోలిపల్లి పీహెచ్‌సీ

నిత్యావసర సరుకుల పంపిణీ

విజయనగరం ఫోర్ట్: సేవాగుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని వ్యాపార వేత్త పెంటపాటి మార్కండేయులు అన్నారు. స్థానిక కణపాక అగుర వీధిలో మంగళవారం 100 మంది పేదలకు బియ్యం, గోధుమ నూక, వంటి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలన్నారు. వారి పట్ల చిరాకు పడకూడదని అన్నారు. గత 15 ఏళ్లుగా మారుతీ స్వయం సహాయక సంఘం ప్రతీ నెల పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మారుతీ స్వయం సహాయక సంఘం అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్, తులసీరామ్, అప్పలస్వామి, పెంటపాటి రాము, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న మార్కండేయులు

నగదు ప్రోత్సాహకం అందజేత

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బీబీఏ చదువుతున్న బట్టు ఆదినారయణను వర్సిటీ వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి, సిబ్బంది మంగళవారం అభినందించారు. ఇటీవల అరుణాచలప్రదేశ్‌లో జరిగిన ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 81 కిలోల విభాగంలో ఆదినారాయణ రజత పతకం సాధించాడు. ఈ నేపథ్యంలో వర్సిటీ ఎస్టేట్ అధికారి సమకూర్చిన రూ.5 వేల ప్రోత్సాహకాన్ని అందజేసి అభినందించారు. వీసీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించి, వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆదినారాయణకు ప్రతీ నెల రూ.5 వేలు పారితోషికం అందిస్తాయనున్నట్లు ఎస్టేట్ అధికారి రామారావు ప్రకటించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, స్పోర్ట్స్ డైరెక్టర్ నారాయణ, కోచ్ అర్జున్ పాల్గొన్నారు.



ఆదినారాయణకు పారితోషికం అందజేస్తున్న వీసీ పీకే మహంతి, రామారావు, తదితరులు

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు

విజయనగరం అర్బన్: కార్డియాక్ అరెస్ట్ వచ్చిన సమయంలో ముందుస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక జీఎంఆర్ వరలక్ష్మి శిక్షణ కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హార్ట్ ఎటాక్‌కు గురైన వ్యక్తులకు అత్యవసర చికిత్సగా చేయాల్సిన సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. కార్డియాక్ అరెస్ట్‌తో స్పృహతప్పి పడిపోయిన వ్యక్తులకు ముందుగా సీపీఆర్ చేయడం ద్వారా వారిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చన్నారు. కరెంట్ షాక్, పాము కాటు, భయం వంటి కారణాలు కార్డియాక్ అరెస్ట్‌కు దారితీస్తాయన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ మేనేజర్, కోఆర్డినేటర్ గౌరీశంకర్, ఎ.రమణ, కార్యదర్శి కె.సత్యం, జీఎంఆర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ మేనేజర్ జి.రమణ, శిక్షకులు జి.సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



సీపీఆర్‌ను ఎలా చేయాలో వివరిస్తున్న బ్లడ్ బ్యాంక్ సిబ్బంది

ఫీల్డ్‌అసిస్టెంట్‌కు మెమో జారీ

గజపతినగరం రూరల్: మండలంలోని కాలం రాజుపేట గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మిత్తిరెడ్డి ఆదిలక్ష్మికి ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ మంగళవారం మెమో జారీచేశారు. ఈనెల 20వ తేదీన గ్రామంలో ఉపాధి పనులు నిలిపి వేయడంతో వేతనదారులు ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీఓ విచారణ చేసి మెమో జారీ చేశారు. డిమాండ్ సిద్ధం చేయకపోవడం వల్ల పనికల్పించ లేక పోయినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ వివరణ ఇచ్చారని ఎంపీడీఓ తెలిపారు.

ఘంటసాల ది గ్రేట్ ప్రివ్యూషో

విజయనగరం టౌన్: ఘంటసాల స్మారక కళాపీఠం సౌజన్యంతో సీహెచ్ ఫణి నిర్మించిన ఘంటసాల ది గ్రేట్ తెలుగు ప్రివ్యూషోను ఎన్‌సీఎస్ థియేటర్‌లో మంగళవారం వేడుకగా నిర్వహించారు. జాతీయ తెలుగు విభాగం నిర్మించిన చిత్రానికి నిర్మాత, దర్శకుడుగా వ్యవహరించిన సీహెచ్ రామారావును కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.భీష్మారావు, ధవళ సర్వేశ్వరరావు, న్యాయవాది నాలుగెస్సుల రాజు, ఎన్‌సీఎస్ గ్రూప్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాస్ తదితరులు దుశ్శాలువతో సత్కరించారు. ఘంటసాల ఆరాధకుడు, గ్రూప్ అడ్మిన్ డాక్టర్ రహీంతుల్లాను అభినందించారు. ఘంటసాల సంగీత కళాశాల విద్యార్థిగా, గాయకునిగా రాణించిన తీరు అద్భుతమని ప్రశంసించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు భవిరెడ్డి శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.



చిత్రనిర్మాత, దర్శకుడు రామారావును సత్కరిస్తున్న కళాపీఠం ప్రతినిధులు

ఘనంగా గ్రామదేవతల పండగ

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామంలో అసిరితల్లి అమ్మవారి పండగ సందర్భంగా గ్రామస్తులు మంగళవారం సిరిమానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పసుపు, కుంకుమ, చీరలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం సిరిమాను సంబరం వైభవంగా సాగింది. అమ్మవారి సిరిమానుకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ధీర ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్ పూజలు చేశారు. సిరిమానోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు. గ్రామంలో ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాంకులు ద్వారా తాగునీరు సరఫరా చేశారు.

పురిటిపెంటలో..

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామంలో పైడితల్లమ్మ వారి పండగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మ వారి ఆలయానికి ఉదయాన్నే చేరుకుని పూజలు చేశారు. చీరలు చూపించి మొక్కులు చెల్లించుకున్నారు.



గుర్ల: కెల్ల గ్రామంలో అసిరితల్లి అమ్మవారి సిరిమానోత్సవం

చినకాదలో...

దత్తిరాజేరు: మండలంలోని చినకాదలో గ్రామదేవత నల్లమారమ్మ తల్లి పండగను గ్రామస్తులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు డప్పు వాయిద్యాల మధ్య ఘటాలతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి చేరుకుని పూజలు చేశారు. రాత్రి రథోత్సవం నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



గుర్ల : కెల్ల గ్రామంలో సిరిమానుకు పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



గుర్ల: కెల్లలో ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్న ధీర ఫౌండేషన్ సిబ్బంది



గజపతినగరం: పురిటిపెంట గ్రామంలో పైడితల్లమ్మ దర్శనానికి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



దత్తిరాజేరు: చినకాదలో అమ్మవారి ఘటాల ఊరేగింపు



గజపతినగరం: పురిటిపెంట గ్రామంలో పైడితల్లమ్మ ఆలయ వద్ద నాగదేవతకు పూజలు చేస్తున్న భక్తులు

స్వచ్ఛంద రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం టౌన్: యాంటీ టెర్రరిజం డే, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నగరంలోని రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అయ్యన్నపేట జంక్షన్ వద్ద ఉన్న మదర్ థెరిసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్, మదర్ థెరిసా కిడ్స్ స్కూల్ సంయుక్తంగా రోటరీ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ ఐ.కృష్ణశాంతి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. యువత స్వచ్ఛందంగా శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు త్యాడ ప్రసాద్‌పట్నాయక్, బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి రవి, రొటేరియన్స్ డాక్టర్ రాధికారాణి, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే

గజపతినగరం: మండలంలో బడి ఈడుకు వచ్చిన దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వేను చేపడుతున్నామని స్థానిక భవత కేంద్రం ఐఈఆర్టీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పాత బగ్గాం, గుడివాడ, మరుపల్లి, ఎం.గుమడాం, బంగారమ్మ పేట, భూదేవిపేట తదితర గ్రామాల్లో మంగళవారం సర్వే నిర్వహించారు. 11మంది దివ్యాంగ పిల్లలను గుర్తించామని, ఈ సర్వే జూన్ 9వ తేదీ వరకు కొనసాగనుందని శ్రీనివాసరావు చెప్పారు.